# రంగుటద్దాలు

## చిల్లర భావనాదేవి

ఆఫీసులో _ అందరితో నవ్వుతూ తుళ్ళుతూ మాట్లాడేస్తుంటుంది రజని. అందమైన ఆమె కళ్ళు 'చేపపిల్లల్లా మిలమిల మెరుస్తూ అందరినీ ఆకట్టుకుంటాయి. సన్నని ఆమె నడుము ఆమె నడకకు లయగా కదుల్తూ ఉంటే తాచులాంటి జడ తాళం వేయటం అందరి హృదయాలను లయతప్పేట్లుగా చేయటం మా మూలే!

రజనితో మాట్లాడాలని ఆఫీసులో అందరూ ఆకాంక్షిస్తారు. అందరితో కలుపుగోలుగా, ప్రసన్నంగా ఉండే రజని మాటల్లో సభ్యత సంస్కారం పోటీపడతాయి.

ఆ రోజున ఆమెతో సీటు ప్రక్కనే కూర్చుని మాట్లాడే యువకుని మీద అందరి చూపులు ప్రశ్నార్థకంగా నిలిచాయి. చిరునవ్వులతో గుసగుసగా మాట్లాడుకుంటున్న వాళ్ళిద్దర్నీ చూడకుండా ఉండలేక పోతున్నారంతా! ఆ యువకుని మీద అందరికీ ఈర్ష్యగానూ ఉంది. ఆసక్తిగానూ ఉంది. అతను ఎవరో ఆమెకీ అతనికీ ఏమిటి సంబంధమో తెలిసేదాకా ఎవ్వరికీ అన్నాహారాలు సయించేటట్లు లేవు. రజని విషయంలో ఉత్కంఠగా ఉన్న పరబ్రహ్మానికి తలనెప్పిగా ఉంది. కామేశ్వర్రావుకు కడుపునెప్పిగా ఉంది. ఇక ఆగలేక లేచి ఆమె సీటు దగ్గరికి వెళ్ళి టైపు చేయటం పూర్తియిందా" అని అడిగాడు.

"ఇదిగోనండీ" ఇచ్చేసిందామె తాపీగా.

కామేశ్వర్రావుకు వెంటనే వెనక్కి రాకతప్పలేదు. వాళ్ళిద్దరూ మాట్లాడుకునే మాటలేవీ వినపడనందుకు తననితాను తిట్టుకున్నాడు.

అందరి చూపులూ ఫైల్స్‌లో ఉన్నట్లుగా నటిస్తున్నాయి. కానీ ఏకాగ్రత అంతా వారిపైనే !

ఆమె సిగ్గుగా నవ్వింది ఎందుకో!

అతను చిలిపిగా చూశాడెందుకో!

పరబ్రహ్మానికి వళ్ళు మండిపోయింది. హెడ్ గుమాస్తాగా ఇక సహించలేక పోయాడు.

"అమ్మాయ్! రజనీ! ఆ ఇంజనీరుగారి ఫైలిలా తీసుకురా" గట్టిగా అరిచినట్లుగా అన్నాడు.

"వస్తున్నా సర్!" ఆమె వినయంగా లేచి చిన్నగా అతనికేదో చెప్పింది.

అతను వెళ్ళిపోయాడు పరబ్రహ్మానికేసి కోపంగా చూసి.

ఆ తర్వాత ఆ యువకుడు తరచుగా ఆఫీసుకు లంచ్ టైములో రావటం, ఇద్దరూ కలిసి కాంటిన్‌లో టిఫిన్‌చేయటం అందరికంటా పడింది. ఆ యువకుని పేరు 'ఆనంద్' అని మాత్రమే తెలుసుకోగలిగారంతా!

వాళ్ళిద్దరూ తరచూ కలవటమే ఆఫీసులో చర్చనీయాంశమయింది. కొందరికి అదే లంచ్ కూడా అయింది పరోక్షంగా.

'ఇలా తిరక్కపోతే పెళ్ళిచేసుకో కూడదూ!'

'మరీ ఆడపిల్లలు బరితెగించి పోయారు.'

ఇలా రకరకాల వ్యాఖ్యల మధ్యన ఓ శుభ ముహూర్తాన శుభలేఖలు పట్టుకొచ్చింది రజని.

"కంగ్రాచ్యులేషన్" మనసులో బాధదాచుకుంటూ వికారంగా చెప్పారంతా.

'థాంక్స్!' అంటూ అందరినీ తన వివాహానికి మరీ మరీ రమ్మనికోరింది రజని.

వరునిపేరు 'ఆనందమోహన్' అని ఉంది శుభలేఖలో. పెళ్ళి తిరుపతిలో జరగటాన ఎవరూ వెళ్ళలేదు. ఊళ్ళోని రిసెప్షన్‌కు పిలిచేసిన ఆఫీసు స్టాఫందర్నీ సాదరంగా ఆహ్వానించింది రజని.

రజని ప్రక్కనే పెళ్లి దుస్తుల్లో కళకళలాడే భర్తను అందరికీ పరిచయం చేసింది ఆనందంగా.

ఎవ్వరికీనోట మాటరాలేదు.

పెళ్ళికొడుకు తామూహించినట్లుగా ఆనంద్ కాదు. "ఎందవంచకి రజని! ప్రేమ ఒకరితో పెళ్ళి ఒకరితోనా! ఇది తెల్సి వూరుకోవటమా!" పరబ్రహ్మం కుతకుతలాడుతున్నాడు.

ఆతని మొహంవంక తమాషాగా చూసిన రజని అటుగా వెళ్తున్న వ్యక్తిని ఆపి అందరికీ పరిచయంచేసింది.

'వీడు మా అన్నయ్య ఆనంద్! చాలాసార్లు మన ఆఫీసుకు వచ్చాడు. చూసేవుంటారు. మా నాన్న లేరుగాబట్టి అన్నయ్యే తండ్రినాకు" ఆమెకళ్ళు చమర్చాయి.

అందరి హృదయాలు భారమైనాయి 'ఎంత తప్పుగా వూహించాము. ఇద్దరు యువతీ యువకులు కలసి మాట్లాడితే రంగులు పులిమే ఈ ప్రపంచంలో మనమూ కలిసిపోయాం"

వారి ఆలోచనలు గ్రహించినట్లుగా రజని నవ్వింది.

'రండి! అంతాభోజనం చేసి ఆశీస్సులందించండి' అంటూ డైనింగ్ టేబుల్స్ ధగ్గరికి తీసుకెళ్తున్న రజని వంక ఆప్యాయతగా చూశారు వాళ్ళు. ఇప్పుడు రజని వాళ్ళ కళ్ళకి తమ తోబుట్టువులా కన్పిస్తోంది. నిర్మలమైన మనసు ప్రపంచంలో నిర్మలత్వాన్నే చూస్తుందనే సత్యం వాళ్ళకి తెలిసింది. మనసు పెట్టుకున్న రంగుటద్దాలు తొలగించి చూస్తే ప్రతి మనసూ వెన్నెలంత స్వచ్ఛంగా ఉంటుందని గ్రహించిన అందరూ రజనిని నిండు మనసుతో ఆశీర్వదించారు.

*